క్లుప్తంగా

సంజీవరాయుడి రథోత్సవం



జూటూరులో సాగుతున్న రథోత్సవం

పత్తికొండ రూరల్ : మండలంలోని జూటూరు గ్రామంలో భక్తుల ఆరాధ్యదైవంగా విరాజిల్లు తున్న సంజీవరాయుడు రథోత్సవం మంగళవారం కనుల పండువగా సాగింది. ఉదయం అర్చకులు నారాయణస్వామి స్వామివారికి ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం రథాంగ పూజలు చేశారు. సాయంత్రం 5.30 గంటలకు జరిగిన రథోత్సవానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. సీఐ జయన్న గ్రామంలో పోలీసు బందోబస్తు ఏర్పాటుచేశారు. బుధవారం వసంతోత్సవంతో వేడుకలు ముగుస్తాయని నిర్వాహకులు తెలిపారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

దేవనకొండ: రైతులు వేరుశనగ పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి సి.హెచ్.సురేష్‌బాబు అన్నారు. మంగళవారం దేవనకొండలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకం కింద 469 మంది రైతులు ఈ–కేవైసీ చేయించుకోకపోవడం వల్ల పీఎం కిసాన్ డబ్బులు పడలేదని, వీరు ఈ–కేవైసీ చేయించుకోవాలని సూచించారు.

అంగన్‌వాడీలకు ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూ చేస్తున్న ఆర్డీఓ, ఐసీడీఎస్ అధికారులు

పత్తికొండ రూరల్ : పత్తికొండ ఐసీడీఎస్ పరిధిలోని ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టులకు ఆర్డీఓ కార్యాలయంలో మంగళవారం ఆర్డీఓ భరత్‌నాయక్, ఐసీడీఎస్ పీడీ నిర్మల ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఖాళీగా ఉన్న 9 పోస్టులకు గాను 34 మంది అభ్యర్థినులు ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. కార్యాలయ ఆవరణలో అంగన్‌వాడీ వర్కర్స్ ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను ఆర్డీఓ పరిశీలించారు.

సమస్యలను పరిష్కరించాలి

తుగ్గలి : ఆశా వర్కర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి శ్రీరాములు డిమాండ్ చేశారు. మంగళవారం పగిడిరాయి, తుగ్గలి పీహెచ్‌సీల పరిధిలోని ఆశా కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఆశాలకు కనీస వేతనం, ఇన్సూరెన్స్, చనిపోయిన ఆశా కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం, 62 ఏళ్లకు రిటైర్మెంట్, సంక్షేమ పథకాల వర్తింపుపై 9నెలలు గడిచినా ఎలాంటి ప్రకటన చేయక పోవడం విచారకరమన్నారు. ఆశాల హక్కుల సాధన కోసం ఈనెల6న విజయవాడలో చేపట్టిన మహా ధర్నాను విజయవంతం చేయాలని కోరారు.

ఆగవేళిలో దేవర ప్రారంభం



పొలి చల్లేందుకు తట్టలను ఊరేగింపుగా తీసుకెళ్లుతున్న గ్రామస్తులు

కృష్ణగిరి: మండలంలోని ఆగవేళి గ్రామంలో గ్రామ దేవతల దేవర మంగళవారం ఘనంగా ప్రారంభమైంది. ఉదయం గ్రామ దేవతలైన రాములమ్మ, పెద్దమ్మ, సుంకులమ్మ, మారెమ్మ, కర్రెమ్మ అమ్మవార్లను ప్రత్యేకంగా ఆలంకరించి ప్రతి ఇంటి నుంచి నైవేద్యంతో పూజలు నిర్వహించారు. గ్రామ పొలిమేరలో పొలి చల్లేందుకు ఈత బర్రెలతో తయారు చేసిన తట్టలను ఊరేగింపుగా తీసుకొచ్చారు. బుధవారం పెద్దమ్మ, మారెమ్మ, కర్రెమ్మ, సుంకులమ్మ అమ్మవారులకు ఆశేష జనవాహిని సమక్షంలో బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకుంటారని గ్రామస్తులు తెలిపారు. అలాగే గ్రామం బంధువులతో కళకళలాడుతోంది.

సారా తయారు చేస్తే చర్యలు

తుగ్గలి : నాటుసారా తయారు చేసినా, అమ్మకాలు జరిపినా పీడీ యాక్ట్ నమోదు చేస్తామని పత్తికొండ ఎక్సైజ్ సీఐ విశ్వేశ్వరావు హెచ్చరించారు. నవోదయ 2.0 కార్యక్రమంలో భాగంగా సారా వల్ల కలిగే అనర్థాలపై మంగళవారం తుగ్గలిలో గ్రామస్తులతో గ్రామసభ నిర్వహించి అవగాహన కల్పించారు. సారా తయారీ, అమ్మకాలు నేరమన్నారు.

నీటి సమస్య రాకుండా చర్యలు

మద్దికెర : వేసవిలో గ్రామాల్లో నీటి సమస్య రాకుండా చర్యలు చేపడుతున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మయాంక్ తెలిపారు. మంగళవారం మద్దికెర, ఎం.అగ్రహారం, పెరవలి గ్రామాల్లో నీటి సమస్యనున్న ప్రాంతాల్లో పర్యటించారు. అవసరమైన చోట పైపులైన్ వేస్తామన్నారు. బోర్లు చెడిపోతే గ్రామ పంచాయతీల్లో తెలియజేయాలని సూచించారు.

గుండెపోటుతో కర్ణాటక భక్తుడి మృతి

హొలగుంద: గూళ్యం గ్రామంలో జోడు రథోత్సవాల్లో పాల్గొని, తిరుగు ప్రయాణంలో ఓ భక్తుడు గుండెపోటుతో మృతిచెందిన ఘటన మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్‌ఐ చంద్ర తెలిపిన మేరకు వివరాలు.. బళ్లారి జిల్లా అవ్వంబావి ప్రాంతానికి చెందిన రాజన్న (55) జోడు రథోత్సవాల్లో పాల్గొన్నాడు. తిరిగి వెళ్తుండగా గుండెపోటుతో కుప్పకూలిపడిపోయాడు. వాహనదారులు ఆలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

ఆరంభ శూరత్వం!

మద్దతు ధరతో రైతుల నుంచి కందులు కొనుగోలు చేస్తున్నామని, ఇందుకు ఆర్‌ఎస్‌కేల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, నమోదు చేసుకున్న వారందరివీ కొంటామని ప్రభుత్వం ప్రకటించింది. కొన్ని రోజులకు పండుగ వాతావరణంలో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోళ్లను ప్రారంభించి గొప్పలు చెప్పుకుంది. అయితే కేవలం కొందరి దిగుబడులను మాత్రమే కొని ఆ తరువాత చేతులెత్తేసింది. దీంతో పంట ఉత్పత్తులను విక్రయించుకునేందుకు రైతులు కర్ణాటకకు వెళ్తుండటంతో తమకు ఖర్చులు భారీగా పెరిగిపోతున్నాయని వాపోతున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ చేతకానితనంపై వారు మండిపడుతున్నారు.

- నామమాత్రంగా కందుల కొనుగోలు
- మొక్కుబడిగా కొని.. చేతులెత్తేసిన ప్రభుత్వం
- అమ్మకానికి కర్ణాటక వెళ్తున్న రైతులు
- రవాణా చార్జీలు తడిసి మోపెడు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న అన్నదాతలు

మొలగవెళ్లిలో కందుల కొనుగోలును ప్రారంభిస్తున్న మార్క్‌ఫెడ్ అధికారులు



చిప్పగిరి: ప్రభుత్వం కందులు కొనుగోలు ప్రక్రియను అట్టహాసంగా ప్రారంభించి నామమాత్రంగా కొనుగోలు చేసి చేతులెత్తేయడంతో మండలంలోని కంది పంటు సాగు రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో ఖరీఫ్‌లో సుమారు 12వేల ఎకరాల్లో కంది పంట సాగు చేశారు. అనావృష్టి, అతివృష్టి కారణంగా అరొకరగా లభించిన దిగుబడులను విక్రయించుకునే సమయంలో మార్కెట్‌లో ధర పడిపోయింది. క్వింటా రూ. 7వేల వరకు లభిస్తుండటం, అంతకుముందు వరకు రూ.10వేలకు పైగా ఉన్న ధర ఒక్కసారిగా పడిపోయినా ప్రభుత్వం చర్యలు చేపట్టలేదు. అన్నదాతల నుంచి విమర్శలు వెల్లువెత్తడంతో ఎట్టకేలకు సర్కారులో చలనం వచ్చింది. మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోళ్లు ప్రారంభించినా అరకొరగా కొని నాణ్యత పేరుతో కొనుగోళ్లను నిలిపేశారు. దీంతో రైతులు దిగుబడులను అమ్ముకునేందుకు కర్ణాటకకు తీసుకెళ్తున్నారు.

పతనమవుతున్న ధరలు..

సరైన దిగుబడులు రాక రైతులు తీవ్ర నిరాశ చెందుతుంటే మరో వైపు మార్కెట్‌లో రోజు రోజుకు ధర తగ్గుతుండటంపై అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం క్వింటా రూ.6వేల నుంచి రూ.8వేల లోపు పలుకుతుండటం, అలాగే అధిక శాతం రైతులకు రూ.7వేల లోపు ధర వర్తిస్తుంది. దీంతో తమకు గిట్టుబాటు ధర లభించడం లేదని, పెట్టబడి కూడా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

500 క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు...

ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా రూ.7,550 మద్దతు ధర ప్రకటించి కొనుగోలు ప్రక్రియ ప్రారంభించింది. అయితే రైతులకు సరైన అవగాహన కల్పించకపోవడంతో చాలా మంది రైతులు అమ్మకానికి రిజిస్ట్రేషన్ చేసుకోలేదు. కొందరు రైతులు నమోదు చేసుకోగా నాణ్యత పేరుతో కేవలం 500 క్వింటాళ్లు మాత్రమే కొని ఆ తరువాత ప్రక్రియన నిలిపివేయడంతో రైతులు కర్ణాటక రాష్ట్రం వెళ్లి విక్రయించుకోవాల్సి వస్తోంది. దీంతో రవాణా ఖర్చులు తడిసిమోపెడవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రాయచూర్ వెళ్లి కందులు విక్రయించాం



ప్రభుత్వం కందులకు ప్రకటించిన క్వింటా ధర రూ.7,550 మద్దతు ధరతో ఇక్కడే అమ్మితే రవాణా ఖర్చులు తగ్గేవి. అధికారులు గ్రామాల్లో సరైన అవగాహన కల్పించక పోవడంతో కర్ణాటక రాష్ట్రం రాయచూర్ తీసుకెళ్లి కందులు విక్రయించాం. దీంతో రవాణా ఖర్చులు పెరిగి నష్టపోయాం. మండలంలో కొద్ది రోజులు మాత్రమే కందులు కొనుగోలు చేసి నిలిపేశారు. రైతులు చాలా ఇబ్బంది పడుతున్నారు. **– హనుమంతు, రైతు,నంచర్ల**

నాణ్యత లోపం కారణంగా కొనుగోళ్లు ఆపేశాం



రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతుల నుంచి మార్క్‌ఫెడ్ అధ్వర్యంలో సివిల్ సప్లయిస్ వారు మద్దతు ధర క్వింటా రూ.7,550 ప్రకారం కందులు కొనుగోలు చేశారు. మండలంలోని నగరడోణ,రామదుర్గం,బెల్డోణ తదితర గ్రామాల్లో 500 క్వింటాళ్ల వరకు కొనుగోలు చేశారు. అయితే మార్క్‌ఫెడ్ వారు కందులు గ్రేడింగ్ చేయించకుండా రైతుల నుంచి నేరుగా కొనడంతో కందుల్లో నాణ్యత లోపం కారణంగా ప్రస్తుతం కొనుగోలు నిలిపేశారు. మార్క్‌ఫెడ్ నుంచి కొనుగోళ్లపై సమాచారం వస్తే రైతులకు తెలియజేస్తాం. **– జయలక్ష్మి, ఏఓ**

'పది' హాల్ టికెట్లు సిద్ధం

తుగ్గలి : ఈనెల 17వ తేదీ నుంచి నిర్వహించే పదో తరగతి పబ్లిక్ పరీక్షల హాల్ టికెట్లు ఆయా పాఠశాలల నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని ఎంఈవో–2 రామవెంకటేశ్వర్లు మంగళవారం తెలిపారు. అన్ని పాఠశాలల హెచ్ఎంలు హాల్ టికెట్లలో విద్యార్థుల పేర్లు, పుట్టిన తేదీ, మీడియం, ఫొటో, సంతకం, ఎంచుకున్న సబ్జెక్ట్ సరిగా ఉన్నాయో లేదో తనిఖీ చేసి ఏవైనా పొరపాటు ఉంటే వారి సంతకంతో dir_govexams@yahoo.com లేదా dir_govexams@apschooledu.in మెయిల్ చేయాలని సూచించారు.

ఆధార్ లేని పిల్లలను గుర్తించండి

చిప్పగిరి: మండలంలో ఆధార్ కార్డు లేని చిన్నపిల్లలను గుర్తించాలని ఎంపీడీఓ అల్లాబకాష్ అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, వివిధ గ్రామాల సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీల సహకారంతో ఆధార్ లేని వారిని గుర్తిస్తే వారికి స్పెషల్ క్యాంపు నిర్వహిస్తామని వెల్లడించారు. ఈఓపీఆర్డీ బాలన్న, పంచాయతీ కార్యదర్శులు సురేంద్ర,సిసింద్రి,నాయక్,నరేంద్ర,నరసింహులు,సుధీర్,ప్రమీళపాల్గొన్నారు.

ఈ-కేవైసీ చేయించుకోవాలి

హాలహర్వి: రబీ సీజన్‌లో పంటలను నమోదు చేసుకున్న ప్రతి రైతు ఈ–కేవైసీ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి శివశంకర్ సూచించారు. మంగళవారం మండలంలోని అర్థగేరి, నిట్రవట్టి గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వీఏఏలు గురుస్వామి, విజయ్ పాల్గొన్నారు.

వేసవిలో ఉపాధి పనులు ఉదయాన్నే చేసుకోవాలి

- కలెక్టర్ రంజిత్ బాషా
- వెల్దుర్తిలో ఉపాధి పనుల పరిశీలన, తహసీల్దార్ కార్యాలయం తనిఖీ
- మండల సర్వేయర్‌కు షోకాజ్ నోటీసులు, ఓ విలేజ్ సర్వేయర్ సస్పెన్షన్‌కు ఆదేశాలు



కూలీలతో మాట్లాడుతున్న కలెక్టర్

వెల్దుర్తి: వేసవి రోజులు కావడంతో ఉపాధి పనులు ఉదయాన్నే చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా తెలిపారు. మంగళవారం ఆయన మండలంలోని అల్లుగుండు పరిధిలో జరుగుతున్న ఉపాధి పనులు పరిశీలించారు. ట్రైనీ కలెక్టర్ కళ్యాణి, డ్వామా పీడీ వెంకట రమణయ్య, కర్నూలు ఆర్డీఓ సందీప్‌కుమార్‌తో కలిసి పనులు జరుగుతున్న ప్రదేశాలకు వెళ్లి కూలీలతో మాట్లాడారు. కూలీ ఎంత పడుతోందంటూ విచారిస్తూ, బాగా పనిచేసుకోవాలంటూ సూచిస్తూ త్వరలో వేతనాలందుతాయన్నారు. ఫారంఫండ్ గుంత తవ్వుతున్న కూలీలను పరిశీలిస్తూ వారు భూమిని గడ్డపారతో బలంగా తవ్వుతుండడం గమనించి.. తానూ గడ్డపార చేతబట్టి మట్టిని తవ్వి చూశారు. మట్టి గట్టిగా ఉండడంతో కూలీలకు గుంత తవ్వేందుకు కష్టంగాను, ఎక్కువ సమయం పట్టడంతోపాటు కూలి తక్కువ పడే అవకాశం ఉనిన కాస్త వెసలుబాటు కల్పించాలంటూ అధికారులను అదేశించారు. మస్టర్లు, హాజరు పరిశీలించి.. లక్ష్యాలను సాధించేలా, ఎక్కువ మంది కూలీలకు పనులు కల్పించేలా పనులు చేపట్టాలని, ఫారంపాండ్‌లపై ఎక్కువ దృష్టి సారించాలని ఏపీఓ లక్ష్మన్నకు సూచించారు. అనంతరం వెల్దుర్తి తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని రికార్డులు పరిశీలించారు. ఇటీవల రెవెన్యూ సదస్సులు, రీసర్వే,గ్రీవెన్స్‌లో వచ్చిన సమస్యల పరిష్కారంపై ఆరాతీశారు. ఇంటిగ్రేటెడ్ సర్వీసుల గడువు దాటి ఉండడం గమనించి సమీక్షించాలంటూ ఆర్డీఓకు తెలియజేశారు. ఈ సందర్భంగా పలువురినుంచి అర్జీలు స్వీకరించారు. పీజీఆర్ఎస్ సర్వే అర్జీల పరిష్కార గడువు దాటి ఉండడంపై విచారించి మండల సర్వేయర్ హేమంత్ రెడ్డికు షోకాజ్ నోటీసులు జారీ చేయాలంటూ, సంబంధిత విలేజ్ సర్వేయర్‌ను సస్పెన్షన్ చేయాలంటూ డీఆర్‌ఓను ఫోన్‌లో ఆదేశించారు. ఎంపీడీఓ సుహాసిని, ఏఎస్ఓ అభిమన్యు, మండల సర్వేయర్ హేమంత్ రెడ్డి, ఏఓ అక్బర్‌బాషా, ఎంఈఓలు ఇందిర, రమేష్, ఈఓఆర్డీ రవికిశోర్ ఉన్నారు.

రుణాలు చెల్లించకపోతే ఆస్తులు జప్తు

చిప్పగిరి: సహకార సంఘంలో రుణాలు పొంది సకాలంలో చెల్లించని ఖాతాదారుల అస్తులు జప్తు చేస్తామని బెల్డోణ సహకార సంఘం సీఈఓ హరికృష్ణ హెచ్చరించారు. మంగళవారం మండలంలోని డేగులపాడు, ఏరూరు, బెల్డోణ తదితర గ్రామాల్లో మొండి బకాయిదారుల ఇంటికి వెళ్లి రుణాలు చెల్లించాలని ఆదేశించారు. వారు మాట్లాడుతూ సహకార సంఘంలో మొత్తం 957 మంది రైతులు, 4,357 మంది సభ్యులు ఉన్నారని చెప్పా రు. మొత్తం రూ.20 కోట్ల వరకు మొండి బకాయిలు ఉన్నాయన్నారు. కొందరు కనీసం వడ్డీలు కూడా చెల్లించడం లేదని, మొండి బకాయిల పట్ల కఠినంగా వ్యవహరించాలని ఉన్నతాధికారులు ఆదేశాలు ఇచ్చారన్నారు. ఆలూరు కెడీసీసీ బ్యాంకు మేనేజర్ రవిప్రకాష్, సూపర్‌వైజర్ రసూల్ పాల్గొన్నారు.



బెల్డోణలో రుణాలు రికవరీ చేపట్టిన బెల్డోణ సహకార సంఘం అధికారులు

వైభవం.. ఓబులేసుడి కల్యాణం

ఆస్పరి: తొగలుగల్లు గ్రామ సమీపంలోని కొండల్లో వెలసిన ఓబులేసు స్వామి, చెంచులక్ష్మి, ఆదిలక్ష్మి కల్యాణోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. పూజారి రాజగోపాల్ ఆధ్వ ర్యంలో స్వామి, అమ్మవార్లకు గంగపూజ, పంచామృతాభిషేకం, పల్లకీ సేవ, మంగళహారతులు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. స్వామి వారి కల్యాణోత్సవం అనంతరం ఉత్సవమూర్తులను గ్రామంలో ఊరేగించారు. వేడుకను తిలకించేందుకు ఆస్పరి, తంగరడోణ, యాటకల్లు, దొడగొండ, బైలుపత్తికొండ, కైరుప్పల, డీ.కోటకొండ తదితర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.



కల్యాణం అనంతరం ఓబులేసుస్వామి, చెంచులక్ష్మి, ఆదిలక్ష్మి

రమణీయం.. జోడు రథోత్సవం

- గూళ్యంలో గురుశిష్యుల రథోత్సవానికి తరలివచ్చిన భక్తులు

హాలహర్వి: మండలంలోని గూళ్యం గాదిలింగేశ్వరస్వామి ఆలయ ఆవరణలో గురుశిష్యులైన కాడ సిద్దేశ్వరస్వామి, గాదిలింగేశ్వరస్వామి జోడు రథోత్సవం వేడుకలు మంగళవారం సాయంత్రం రమణీయంగా సాగింది. అశేష భక్తజనుల మధ్య రథ చక్రాలు ముందుకు కదిలాయి. ఈ సందర్భంగా గొరవయ్యల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. భక్తులు రథాలపైకి అరటి పండ్లు, పూలను విసరి భక్తిని చాటుకున్నారు. ఉదయం స్వామివార్లకు జలాభిషేకం, కుంకుమార్చన, మహామంగళహారతి, పంచామృతాభిషేకం తదితర విశేష పూజలు నిర్వహించారు. ఆంధ్ర, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాల నుంచి వేల సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. డీఎస్పీ బి.వెంకటరామయ్య, సీఐ వెంకటచలపతి, ఎస్ఐ చంద్ర ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. నిట్రవట్టి, హాలహర్వి, బాపురం గ్రామస్తులు బాపురం నుంచి గూళ్యం వెళ్లే రహదారిలో భక్తులకు అన్నదానం, మజ్జిగ, మంచినీటిని అందించారు.



అశేష భక్త జనుల మధ్య సాగుతున్న జోడు రథోత్సవం

విద్యుత్ వేళల్లో మార్పులు

కృష్ణగిరి: మండలంలోని చిట్యాల విద్యుత్ సబ్‌స్టేషన్ కింద ఉండే చిట్యాల ఫీడర్ కింద ఉండే గ్రామాలకు బుధవారం నుంచి వ్యవసాయానికి అందించే విద్యుత్ వేళల్లో మార్పులు చేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ మద్దిలేటి మంగళవారం తెలిపారు. చిట్యాల, పెద్దొడ్డి గ్రామాల్లో ఆర్‌డీఎస్ఎస్ పనులు జరుగుతుండటంతో వ్యవసాయానికి ఉదయం 5 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా ఉంటుందని, రైతులు గమనించాలని ఆయన కోరారు. అలాగే ఆయా గ్రామాల్లో గృహాలకు కూడా మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకు సరఫరా నిలిపివేస్తామని చెప్పారు. 15 రోజులపాటు ఇలాగే సరఫరా ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

మద్దికెర : పదో తరగతి విద్యార్థులు బాగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎంఈఓ రంగస్వామి అన్నారు. మంగళవారం స్థానిక కస్తూర్బా విద్యాలయంలో పదో తరగతి విద్యార్థినులకు దాత సూర్యనారాయణ అందించిన ప్యాడ్స్, పెన్నులు పంపిణీ చేశారు.

రైతులను మోసం చేయొద్దు

పత్తికొండ రూరల్ : సోలార్ ప్లాంట్ పేరుతో ఇంటింటికీ ఉద్యోగం ఇస్తాం, డబ్బులిస్తాం మీ భూమలివ్వండని మరోసారి రైతులను మోసం చేయొద్దని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ క్రాంతినాయుడు కోరారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గతంలో ఏర్పాటు చేసిన గాలి మరలు కంపెనీలకు, నాయకులకు ఉపయోగపడ్డాయి కానీ రైతులకు ఏమాత్రం ఉపయోగం జరగలేదన్నారు. పందికోన రిజర్వాయర్ ద్వారా 85వేల ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉండగా ప్రస్తుతం కేవలం 20వేల ఎకరాలకు మాత్రమే నీరు అందుతుందన్నారు.

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి

పత్తికొండ రూరల్ : మహిళలు అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని అన్ని రంగాల్లో రాణించాలని ఆర్డీఓ భరత్‌నాయక్ పిలుపునిచ్చారు. మంగళవారం పత్తికొండలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో అంగన్‌వాడీ సిబ్బందితో కలిసి అంతర్జాతీయ మహిళాదినం వారోత్సవాల్లో భాగంగా ఆర్డీఓ కార్యాలయం నుంచి నాలుగు స్తంభాల కూడలి వరకు నిర్వహించిన కొవ్వొత్తుల ర్యాలీలో ఆర్డీఓ భరత్‌నాయక్ సతీమణి లిఖితతో కలిసి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ వృత్తి, ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో మంచి నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ సువర్ణలత పాల్గొన్నారు.



పత్తికొండలో కొవ్వొత్తుల ర్యాలీలో సతీసమేతంగా పాల్గొన్న ఆర్డీఓ భరత్‌నాయక్

దాడులు ఆపాలి

పత్తికొండ రూరల్ : ఆటో కార్మికులపై నూతన వాహన చట్టం ప్రయోగిస్తూ చేస్తున్న ప్రభుత్వ అధికారులు చేస్తున్న దాడులు వెంటనే ఆపాలని ఏఐటీయుసీ జిల్లా డిప్యూటీ కార్యదర్శి ఎన్.క్రిష్ణయ్య అన్నారు. మంగళవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో స్థానిక చదువుల రామయ్య భవన్ నుంచి నాలుగు స్తంభాల కూడలి వరకు ఆటో కార్మికులతో ర్యాలీ చేసి ధర్నా చేపట్టారు. ఏఐటీయూసీ తాలుకా అధ్యక్షుడు జి.నెట్టికంటయ్య అధ్యక్షతన జరిగిన ఆందోళనలో క్రిష్ణయ్య మాట్లాడుతూ ప్రభుత్వాలు నూతన చట్టాల పేరుతో భారీ జరిమానాలు విధిస్తూ ఆటో కార్మికులను వేధించడం సరికాదన్నారు.



పత్తికొండలో ఆందోళన చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు, ఆటో కార్మికులు

కర్ణాటక మద్యం స్వాధీనం

ఆలూరు రూరల్: అక్రమంగా కర్ణాటక మద్యం సరఫరా చేస్తున్న వ్యక్తి వద్ద నుంచి 7 బాక్సులు మద్యం స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్టు చేసినట్లు ఆలూరు ఎక్సైజ్ సీఐ లలిత తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం స్థానిక ఎక్సైజ్ పోలీసు కార్యాలయ ఆవరణలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. ఉదయం చిప్పగిరి మండలం సంగాల గ్రామ సమీపంలోని వాహన తనిఖీలు చేపట్టగా ఆలూరు మండలం మొలగవల్లి గ్రామానికి చెందిన ఎరుకల కృష్ణ బైక్‌పై తరలిస్తున్న 7 బాక్సులు కర్ణాటక మద్యం 672 టెట్రా ప్యాకెట్లు (90 ఎంఎల్) గుర్తించి స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. నిందితుడు కృష్ణను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించి బైక్ సీజ్ చేసినట్లు వివరించారు. ఎస్ఐ నవీన్ బాబు సిబ్బంది విజయ్, మాలవ్య, సూర్య ప్రకాష్, లక్ష్మమ్మ సోమేష్ పాల్గొన్నారు.



పట్టుబడిన మద్యాన్ని చూపుతున్న ఎక్సైజ్ పోలీసులు

నోటీస్ బోర్డు

నేడు మండల సర్వసభ్య సమావేశం

తుగ్గలి : స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఇన్‌చార్జ్ ఎంపీపీ ఎర్ర నాగప్పయాదవ్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నారు. గతంలో రెండుమార్లు ఎంపీటీసీ సభ్యులు సమావేశానికి హాజరు కాకపోవడంతో కోరం లేక వాయిదా పడిన సంగతి తెలిసిందే. సమావేశానికి సర్పంచ్‌లు, జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు హాజరు కావాలని ఎంపీడీఓ విశ్వమోహన్ కోరారు. అలాగే అన్ని శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలతో సమావేశానికి హాజరు కావాలని సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

కృష్ణగిరి: మండలంలోని కంబాలపాడు గ్రామ శివారులోని డా. బీఆర్ అంబేడ్కర్ (సాంఘిక సంక్షేమ) బాలికల గురుకుల పాఠశాలలో 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఐదవ తరగతి, ఇంటర్ ఫస్టియర్‌కు అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్న ప్రిన్సిపాల్ సుజాత మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం నాల్గవ తరగతి చదువుతున్న విద్యార్థులు ఐదవ తరగతికి, పదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఇంటర్ ఫస్టియర్‌కు ఈ నెల 6వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రవేశ పరీక్షలో మంచి మార్కులు సాధించిన వారికి సీటు కేటాయిస్తారన్నారు. అర్హులైన విద్యార్థులు రెండు రోజుల్లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

దరఖాస్తు చేసుకోండి

మద్దికెర : మండలంలోని ఆయా గ్రామాల్లో తమ పిల్లలకు ఇంతవరకు పుట్టిన రోజు ధ్రువపత్రాలు పొందని చిన్నారుల తల్లిదండ్రులు పుట్టినరోజు ధ్రువపత్రాలకు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ హుసేన్‌సాహెబ్ తెలిపారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు బర్త్ సర్టిఫికెట్లు తీసుకోని వారిని గుర్తించి ధ్రువపత్రాలు తీసుకునేలా ప్రోత్సహించాలన్నారు. గ్రామ సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ చేయిస్తే పరిశీలించి మంజూరు చేస్తామన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పేరుతో ఫేమస్..

- విభిన్నంగా హోటళ్లు, కేఫ్‌లకు పేర్లు
- వినియోగదారులను ఆకట్టుకునేలా ఎంపిక
- నూతన వ్యాపార సూత్రాలతో విభిన్న ప్రచారం



పత్తికొండ(తుగ్గలి) : వ్యాపారంలో వినియోగదారులే కీలకం.. వారిని తమ వ్యాపారం వైపునకు ఆకట్టుకోవడం ముఖ్యం. చేసే వ్యాపారం నేరుగా వారికి తెలియజేసే విధానంలో నూతనత్వం కనిపించాలనే తపన నిర్వాహకుల్లో కనిపిస్తోంది. కొత్తగా ఏదైనా వ్యాపారం ప్రారంభించాలంటే మన దగ్గర ఏదో ఒక స్పెషల్ ఉండాలి. వస్తువులు, ఆహార పదార్థాలు, పానీయాల సంగతి పక్కన పెడితే పేరులోనే కొత్త దనం ఉండాలి. వెంటనే జనాల్లోకి వెళ్లాలి. షాపు లైనా, కేఫ్‌లైనా, హోటళ్లకైనా పెట్టే పేరుతోనే సగం ప్రచారం రావాలి. పూర్వం నుంచి వ్యాపార సంస్థలకు, హోటళ్లకు, దుకాణాలకు సాధారణంగా చాలామంది దేవుళ్ల పేర్లో, తమ ఇంట్లో వారివో లేదా ప్రాంతీయతతో కూడిన పేర్లతో బోర్డులు తగిలించుకొని వ్యాపారాలు చేసేవారు. ఇప్పటికీ ఇంకా కొందరు నమ్మకంతో ఆ విధానాన్నే కొనసాగిస్తున్నారు. అయితే.. ఇంకొందరు భిన్నంగా.. ఇట్టే గుర్తించేలా కస్టమర్లను దగ్గర చేసుకునే విధంగా తమ వ్యాపారం సంస్థలకు పేర్లు పెట్టుకుంటూ ఆకట్టుకుంటున్నారు. ఇటీవల టీ కేఫ్‌లు, హోటళ్ల పేర్లు వినియోగదారుడి చూపును ఆకర్షిస్తున్నాయి.

పోటీ దృష్ట్యా..

పోటీ వ్యాపారంలో పాత విధానాలకు స్వస్తి చెప్పి నూతన విధానాల వైపునకు వ్యాపార వర్గాలు దృష్టి మళ్లిస్తున్నాయి. నగరాలతో పాటు చిన్నచిన్న పట్టణాల్లో సైతం పేర్లలో నూతన ట్రెండ్ వచ్చింది. పత్తికొండ పట్టణంలో ఇటీవల కొత్తగా వెలసిన నూతన టీ కేఫ్‌ల పేర్లలో కొత్తదనం కనిపిస్తోంది. రుచికరమైన టీ, కాఫీ అందించే కేఫ్‌లకు పెట్టే పేర్లు ఫేమస్ అవుతున్నాయి. 'తాగుదాం చాయ్', మిస్టర్ టీ తిప్పరా మీసం, వనం కేఫ్, టీ బ్రేక్ వంటి పేర్లు తారసపడుతున్నాయి. డాబాలకు సైతం .. మిరపకాయ ఫ్యామిలీ రెస్టారెంట్, చిల్లీ పెప్పర్ రెస్టారెంట్ తదితర పేర్లతో కొత్త ట్రెండ్ సృష్టిస్తున్నారు.




నాలుగు రోడ్ల కూడలిలో 'మిరపకాయ ఫ్యామిలీ రెస్టారెంట్'



గుత్తి రోడ్డులో 'తాగుదాం టీ' కేఫ్

కస్టమర్లను ఆకర్షించేలా..

సాధారణంగా వివిధ పేర్లతో టీ, భోజన హోటళ్లు నిర్వహిస్తుంటారు. అందుకు భిన్నంగా కస్టమర్లను ఆకర్షించేందుకు వెరైటీ పేర్లతో వ్యాపారాన్ని నిర్వహిస్తున్నారు. టీ, భోజన ప్రియులకు నేరుగా అర్థమయ్యేలా, ఆకట్టుకునే విధంగా పేర్లు పెడుతున్నారు. పోటీ దృష్ట్యా కస్టమర్ల ఆదరణ కోసం వైరైటీ పేర్లతో వ్యాపారం ప్రారంభించినట్లు యజమానులు పేర్కొంటున్నారు.



బైపాస్ నాలుగు రోడ్ల కూడలిలో 'మిస్టర్ టీ తిప్పరా మీసం' కేఫ్



గుత్తి రోడ్డులో 'చిల్లీపెప్పర్ రెస్టారెంట్' పేరుతో హోటల్